


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 6 పుష్పం : 10-11 5-12-2003



RAMANA BHASKARA
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 9 ISSUE : 6

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**



ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188


## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 12-11-03, కైకలూరు

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

స్వార్థం లేకుండా మనం ఏపనిచేసినా అదియజ్ఞంతో సమానము అని భగవంతుడు చెప్పాడు. మనకు ఆత్మజ్ఞానమురాకపోవటానికి స్వార్థమేకారణం. గుడికి వెళ్ళినప్పుడు, పెద్దల దగ్గరకు వెళ్ళినప్పుడు వట్టి చేతులతో వెళ్ళకూడదని చెపుతారు. గుడికి వెళ్ళినప్పుడు పండుగాని, పుష్పంగాని తీసుకొనివెళతాము. ఆపండు ఎవరిది అంటే దేవుడిదే, ఆపుష్పం ఎవరిది అంటే దేవుడిదే. అంటే ఆయనది ఆయనకే ఇస్తున్నాము. ఏదో ఇవ్వటం మనకు అలవాటు చేయటం కోసం మన పెద్దలు అలా చెపుతారు. అంటే ఇలా ఇవ్వగా ఇవ్వగా ఎప్పటికైనా మనస్సు అనే పుష్పాన్ని దేవుడికి ఇవ్వటం మనకు అలవాటు అవుతుంది. మనస్సు అనే పుష్పాన్ని ఎప్పుడైతే దేవుడికి ఇచ్చామో హృదయంలో ఉన్న బ్రహ్మం మనకు వ్యక్తమవుతుంది. దేవుడు రామేశ్వరంలో ఉన్నాడు, కాశీలో ఉన్నాడు అని చాలామంది అనుకొంటున్నారు కాని హృదయంలో ఉన్న దేవుడు నిజం ఇందులో రాజీలేదు, వాదనతో పనిలేదు. తన హృదయంలోనే దేవుడు ఉన్నాడు అన్న విషయం మర్చిపోయి జీవుడు చెట్లుచుట్టూ, పుట్టలచుట్టూ, ఆఊరిచుట్టూ, ఈ ఊరిచుట్టూ తిరుగుచున్నాడు, మనకు బయటచూపు అలవాటు అయిపోయింది అందుచేత దేవుడు


**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

12-11-2003 కైకలూరు ........ 1
18-11-2003 జువ్వలపాలెం ........ 10




బయటఉన్నాడు అనిచెపితే మనకు ఇష్టంగా ఉంటుంది. మనకులోచూపులేదు. మనకులోచూపు నేర్పటానికే ఈజ్ఞానయజ్ఞాలు, మనకు ఎంత ధనం ఉన్నా, గౌరవం ఉన్నా, అధికారం ఉన్నా లోచూపులేకపోతే వాడికి ఆత్మజ్ఞానం కలుగదు, లోచూపులేనివాడికి లోపలఉన్న పరమాత్మ తెలియబడడు. హృదయంలో దేవుడు ఉన్నాడు అని మనం నోటితో అనుకొన్నప్పటికి మన మనస్సు తొందరగా అంగీకరించదు. మన నోటికి శుద్ధిలేదు, బుద్ధికి శుద్ధిలేదు. కాని మనకు ఆత్మజ్ఞానం వచ్చేయాలి, ఇది దురాశ. మనం ఏదైనా పొందాలి అంటే దానికి తగిన యోగ్యత, అర్హత మనకు ఉండాలికదా. ఏమీ అర్హతలేకుండా, యోగ్యత లేకుండా ఆత్మసామ్రాజ్యానికి అధిపతి ఎలాఅవుతాడు. కొంచమైనా అర్హత ఉండాలి కదా. నోటికి శుద్ధి కలగటంకోసం, బుద్ధిశుద్ధి అవ్వటం కోసం యజ్ఞాలను భగవంతుడు చెప్పాడు. ఎక్కడో సుఖం ఉంది, ఎక్కడో శాంతి ఉంది అని మనస్సు లక్షలాది జన్మల నుండి ఎక్కడ ఎక్కడో తిరుగుతోంది. జీవుడు ఏ సుఖాన్ని అయితే కోరుకొంటున్నాడో, ఏ శాంతిని అయితే కోరుకొంటున్నాడో అది తన హృదయంలోనే ఉంది అన్న సంగతే వాడికి గుర్తింపు రావటంలేదు. ఆ గుర్తింపు తేవటానికే ఈ జ్ఞానయజ్ఞాలు. సబ్జక్టును సరిగా అర్థం చేసుకోకుండా బండతనంగా ఆత్మజ్ఞానంరాదు. మీకు ధనం ఉంటే భోగం వస్తుంది కాని ఆత్మజ్ఞానంరాదు. కళ్ళు చూస్తాయి, కాళ్ళు నడుస్తాయి, అంతేగాని కళ్ళు చేసేపని కాళ్ళు చేయలేవు, కాళ్ళు చేసేపని కళ్ళు చేయలేవు. అలాగే ధనం చేసే పని అది చేస్తుంది కాని అది జ్ఞానాన్ని ఇవ్వలేదు. ధనం వలన భోగం వస్తుంది, జ్ఞానం వలన సుఖం, శాంతి వస్తుంది. హృదయస్థలంలో మనస్సును ఉంచగలిగితే కర్మమార్గం, ధ్యానమార్గం, భక్తిమార్గం అన్నిమార్గాల యొక్క ఫలితాన్ని నీవు పొందుతావు అని చెపుతున్నారు. మనిషి భౌతికంగా, ఆధ్యాత్మికంగా పతనమవ్వటానికి మనస్సులో ఉన్న చాపల్యమే కారణం హృదయస్థలంలో మనస్సును నిలబెట్టి ఉంచినప్పుడు మనస్సు యొక్క చాపల్యం పోతుంది, మనస్సుకు చల్లధనం వస్తుంది. మనం ఎక్కువగా విషయచింతనలో ఉంటున్నాము. విషయచింతన వలన మనం బంధంలో పడతాము. ఆత్మచింతన వలన మనం బాగుపడతాము, మనకు మోక్షం కలుగుతుంది. డైరెక్టుగా ఆత్మను చింతించే యోగ్యత లేనప్పుడు ఏదో ఒక అవతారపురుషుడి రూపాన్ని ధ్యానిస్తూ, ఆనామాన్ని స్మరించుకొంటూ ఉంటే చిత్తశుద్ధి కలుగుతుంది, అప్పుడు జ్ఞానానికి అర్హత కలుగుతుంది. అజ్ఞానం అంతా, మాయ అంతా మనస్సులోనే ఉంది. వారిని, వీరిని విచారణ చేస్తాముగాని మన మనస్సు ఎలాఉందో దానిని మనం విచారణ చేయటంలేదు. ఎవరోవచ్చి ఇక్కడ కూర్చొన్నారు అనుకోండి. వారు ఎవరు, ఎక్కడ నుండి వచ్చారు అని విచారణ మొదలు పెడతాము కాని మనస్సు అంటే ఏమిటి, ఇది ఎక్కడ నుండి వచ్చింది అని మనం విచారణ చేయటంలేదు. మనందరము అసలు బుద్ధిలేనివారముకాదు, బుద్ధితక్కువ మనుషులం.

వారి గురించి, వీరి గురించి విచారణ ఎందుకు, నిన్ను నీవు విచారణ చేసుకో, నిన్ను నీవు విచారణ చేసుకొంటూఉంటే నీకు వివేకం ఉన్నట్లు గుర్తు. నీకు వివేకం ఉంటే దేవుని దయ నీ మీద వర్షిస్తుంది. ఇతరులు ఎవరూ పెట్టలేని బాధ నీమనస్సు నిన్ను పెడుతోంది. అందుచేత ఈ మనస్సు యొక్క పోకడ ఏమిటో తెలుసుకో. ఇతరుల గుట్టు తెలుసుకొనే బదులు నీ మనస్సు యొక్క గుట్టు తెలుసుకొని, ఆ మనస్సు యొక్క జాడ తెలుసుకొని, అది ఎక్కడయితే ఉదయిస్తోందో అక్కడకు దానిని తీసుకొని వెళ్ళటానికి ప్రయత్నం చెయ్యి, మనస్సు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది. ఇది ఒక పద్దతి, ఈ పద్ధతి అందరికి సరిపోదు. బుద్దిసూక్ష్మత ఉన్నవారు ఈ మార్గంలో ప్రయాణం చేయగలరు. కొంతమందికి స్థూల బుద్ది ఉంటుంది, వారికి భక్తి మార్గం మంచిది. అంటే నీ మనస్సు చెప్పినట్లు నీవు వినకు, భగవంతుడు చెప్పినట్లుగా నీ మనస్సు వినేటట్లు అలవాటు చెయ్యి, నీకు బుద్ది సూక్ష్మత లేనప్పుడు భగవంతుడి పాదాలను ఆశ్రయించు, భగవంతుడు ఎలా చెపితే అలా నడుచుకో అలాగయినా నీమనస్సు నశిస్తుంది. నీకు నచ్చిన మార్గంలో ప్రయాణించి నీవు తరించటానికి ప్రయత్నం చేసుకో నువ్వు లేవు, నేను లేను ఇవి అన్నీ తొడుగులే అంటారు భగవాన్. నేను పొడవుగా ఉన్నాను, నేను తెల్లగా ఉన్నాను నేను స్త్రీని లేకపోతే నేను పురుషుడను అని ఇలా అనుకొంటున్నావు. శరీరం వచ్చాక ఇవి అన్నీ వస్తున్నాయి. ఇలా నీవుకాని గొడవలు నెత్తిమీద వేసుకొని తిరగటం మరల వాటిని పోగొట్టుకోవటానికి సాధన మొదలుపెట్టటం. నీవు ఎవరవు. నీవు ఆత్మవు. అది నీకు తెలిసినా, తెలియకపోయినా నీవు ఆత్మవే,  తెలిస్తే సుఖపడతావు, తెలియకపోతే దుఃఖపడతావు. నీవుకాని దేహాన్ని నీవు అనుకోవటం, నేను ఏదో సాధించాను అనుకోవటం, ఇలా అనుకోవటంవలననే అజ్ఞానం పెరిగిపోతూ ఉంటుంది. దేవుని దయలేకుండ నీవు ఏమీ సాధించలేవు. జ్ఞాని ఆస్తిని అన్యాక్రాంతం చేయవచ్చునా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నాడు. జ్ఞాని ఆస్తిని అన్యాక్రాంతం చేస్తాడు లేకపోతే చెయ్యడు అది ఆదేహప్రారబ్దమును బట్టి ఆధారపడి ఉంటుంది, అడగటానికి నువ్వు ఎవడవు? నువ్వు ఇక్కడకు ఎందుకు వచ్చావు? నేర్చుకోవటానికి వచ్చావా లేక జ్ఞానికి ఏదైనా సర్టిఫికెట్ ఇవ్వటానికి వచ్చావా? నీ సర్టిఫికెట్ మీద జ్ఞాని ఆధారపడి  ఉన్నాడా? ఎందుకు వచ్చావో అది మర్చిపోయి మాట్లాడుతున్నావు, బాహ్యంగా జరిగే సంఘటనలను బట్టి జ్ఞానిని కొలువలేము. రాముడు, కృష్ణుడు యుద్దాలు చేసారు, రామకృష్ణుడు యుద్దం చేయలేదు, అది వారి దేహప్రారబ్దమును బట్టి ఉంటుంది కాని వారిజ్ఞానం యొక్క వైభవానికి భంగంలేదు. అది బాహ్యచూపు ఉన్నవారికి తెలియదు. ఇది ఎందుకు చెపుతున్నాను అంటే మనలను మనం విమర్శించుకోవటం మానివేసాము, మనలను మనం తెలుసుకొనే ప్రయత్నం





వదిలేసాము, ఇతరుల గురించి ఆలోచిస్తున్నాము. మీ మనస్సును బోను ఎక్కించండి, వివేకం విడిచిపెట్టవద్దు. ఎక్కడయితే భక్తి ఉందో, ఎక్కడయితే వినయం ఉందో, ఎక్కడయితే చిత్తశుద్ధి ఉందో వారికి ఈశ్వరుని దయ కలుగుతుంది. ఈశ్వరుని దయలేకుండా ఈశ్వర స్వరూపం మనకు దొరకదు. మనకులోచూపు కలుగజేసేవాడే నిజమైన గురువు. ఎవరి దేహప్రారబ్దం వారిది. ప్రతీ దానికి వారు అలా ఉన్నారు, మనం కూడా అలా ఉందాము అంటే అది పిరికివారి లక్షణం, ఇలా పోల్చుకోవటం వలననే దారిద్ర్యం వస్తుంది. ఇతరులతో పోల్చుకోవలసిన పని ఏముంది. అలా పోల్చుకోవటంవలన అజ్ఞానం పెరుగుతుంది. ఇంట్లో తుమ్మచెట్టు ఉంటే దరిద్రం, ఆచెట్టు ఉంటే దరిద్రం ఇలా కొంతమంది చెపుతూ ఉంటారు అది సత్యమో, అసత్యమో నాకు తెలియదు కాని పోల్చుకోవటంవలన మటుకు మానసిక దారిద్ర్యం వస్తుంది. అందరూ మనలాగ ఉండాలని అనుకోకూడదు. అలా అనుకొంటూ ఉంటే అది వాడి అమాయకత్వానికి గుర్తు. మనకు శ్రద్ధలేదు అందువలన మనకు జ్ఞానం రావటంలేదు. మీరు జపం చేసేటప్పుడు మనస్సు అక్కడ పెట్టి చెయ్యాలి. జపం చేయగా చేయగా ఇతర తలంపులు ఆగిపోతాయి, చివరకు జపించే జపికూడా అదృశ్యమైపోతాడు, అప్పుడు ఈశ్వరుడు మీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు.

నువ్వు దేహము కాదు కానిదానిని వేసుకొని తిరుగుతున్నావు. ఆదేహము ఏదో పనిచేస్తూ ఉంటుంది. ఏదో రెండు ఎకరాలు పొలం కొన్నది అనుకోండి నేను పొలంకొన్నాను అనుకోవటం. పొలంకొంటే కొనుక్కో ఆపొలం నీవుకాదు, కొన్నవాడివి నీవుకాదు, మనస్సు ఏదో ఆలోచించింది, ఆదేహం వెళ్ళి పొలం కొంటుంది. ఆమనస్సు నీవుకాదు, దేహం నీవుకాదు, అది లోకంలో ఏదో చేస్తూ ఉంటుంది, నీవుదానితో తాదాప్యం పొంది సడన్‌గా వెళ్ళి సుడిగుండంలోపడటం ఇది నీవు చేసే పని అంటున్నారు భగవాన్. నేను రెండు ఎకరాలు కొన్నాను అని అస్తమాను తలపెట్టుకొనేవాడివి, ఇంక నీవు దేవుడిని ఏమి స్మరిస్తావు. దేవుడిని స్మరించటం మానేసి నేను పొలంకొన్నాను, నేను పొలంకొన్నాను అని ఊరేగుతూ ఉంటే ఇంకనీకు జ్ఞానమా? శుభ్రంగా మొదలకు నరికిపోగులు పెడుతున్నారు భగవాన్, మీకు ఇష్టమైతే వినటం లేకపోతే వెళ్ళిపోవటం. ఎందుచేతనంటే ఆయనకు ఒకపార్టీలేదు, జనాన్ని పోగుచేసుకొవాలనే బుద్ధిలేదు. ఫలానావాడు నాశిష్యుడు అని ఆయన జీవితంలో ఎప్పడూ చెప్పలేదు. సత్యాన్వేషకుడి గురి అంతా ఎప్పడూ సత్యం మీదే ఉండాలి లేకపోతేవాడు సత్యాన్వేషకుడు కాదు. మనం ఆత్మ విచారణ చేస్తున్నాము అనుకోవటం కాని చేసేది లోకవిచారణ. లోకవిచారణ చేసేవాడు లోకానికి దగ్గరవుతాడు కాని భగవంతుడికి దగ్గర అవ్వలేడు. మొన్న రాత్రి నాకు కల వచ్చింది, చాలా విచిత్రం అయ్యింది. నేను సినిమాలు మానేసి 40 ఏళ్ళు అవుతుంది. నాకు సినిమాకు వెళ్ళినట్లు స్వప్నం వచ్చింది పైగా సైకిలు

మీద వెళ్ళాను. సైకిలు అక్కడ పెట్టుకొన్నాను, సినిమాకు వెళ్ళాను. బయటకు వచ్చేటప్పటికి నా సైకిలు ఎవడో పట్టుకొనిపోయాడు. సైకిలు పట్టుకొనిపోయిన వాడిని ఏమన్నా అన్నా ఫరవాలేదు, సమాజం యిలా తయారయిపోయింది అని మనస్సులో అనుకొంటున్నాను, ఈలోపు మెలుకువ వచ్చేసింది. అప్పుడు సైకిలు గొడవలేదు, సైకిలు పోయింది అని బాధలేదు, సమాజం లేదు అన్నీ పోయినాయి. ఆశ్చర్యంవేసింది నాకు. జ్ఞానం పొందిన వాడిస్థితి అంతే. హృదయంలో ఉన్న జ్ఞానం మనకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఈసృష్టి అంతా కూడా అంతే. కాకపోతే అది మాటలకు అందని విషయం, అది అనుభవంలోనికి రావలసిందే, కోరికలేని కర్మ చిత్తశుద్ధిని కలుగజేస్తుంది చిత్తశుద్ధి శివుని పాదాల దగ్గరకు చేరుస్తుంది. చిత్తశుద్ధి కోసమే మనం సత్కర్మ చేయాలి, సత్పురుషుల సహవాసం చేయాలి. ఏజీవుడు అయినా చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మోక్షంలోనికి వెళ్ళాలి. ఇప్పుడు మనం ఎవరి గురించి అయినా బాధపడుతున్నాము అనుకోండి, వారికి మనకు సంబంధం ఏమిటి అని ఒక్కసారి ప్రశ్నించుకొంటే ఏమీలేదు. దేహభావనపోతే ఒకరికి ఒకరికి సంబంధంలేదు, ఉన్నది ఒక్కటే, తలంపులే అనర్థాలను తీసుకొని వస్తాయి. తలంపు లేకపోతే అనర్థం లేదు. జపంవలన నీకు తలంపులు ఆగిపోతాయి. చివరకు జపం చేసే తలంపు కూడా పోతుంది. అప్పుడు నీహృదయంలో ఉన్న నిజస్థితి నీకు వ్యక్తమవుతుంది, మనకు సాత్వికబుద్ధిలేదు. సాత్విక బుద్ధిలేనివాడికి సహనం ఉండదు. సహనం లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. ప్రయత్నం లేని సహజస్థితి మనకు వచ్చేవరకు మనం ప్రయత్నం చేస్తూనే ఉండాలి చేస్తే సత్కర్మ చేయాలి మాట్లాడితే మంచిమాటలు మాట్లాడాలి, చూస్తే మంచిదృశ్యాలు చూడాలి, మనస్సులో మంచితలంపులు వచ్చేలాగ చూసుకోవాలి, ఇవన్నీ కూడా ప్రయత్నమే, ఇది అంతాకూడా సాధనలో భాగమే. జపం విషయచింతనలో నుండి నిన్ను విడుదల చేసి దైవచింతన లోనికి మళ్ళిస్తుంది. అందుచేత జపాన్ని విడిచిపెట్టవద్దు. దీపం క్రింద నీడ ఉంటుంది కాని చుట్టు ప్రక్కల అంతా వెలుతురు ఇస్తుంది. అలాగే ఒకోసారి బ్రహ్మజ్ఞాని దగ్గర ఉన్నవారు ఆయన వైభవాన్ని మిస్ అయిపోతారు, దూరంగా ఉన్నవారు ఆకర్షింపబడివచ్చి తరించి వెళ్ళిపోతారు అని రామకృష్ణుడు చెప్పారు. బయట మీకు ఎంతధనం ఉన్నా అధికారం ఉన్నా హృదయంలో బీదతనంగా ఉండాలి. హృదయంలో నేను గొప్పవాడిని అనుకోకూడదు. ఎవడైతే లోపల బీదవాడిగా ఉంటాడో వాడే జ్ఞానానికి వారసుడవుతాడు. మీ ఇంట్లోవారు అవ్వనివ్వండి, పరాయివారు అవ్వనివ్వండి ఎవరైనా మిమ్మల్ని పీడుస్తున్నారు అనుకోండి వారికి మనకు సంబంధం ఏమిటి అని ఒక్కసారి ప్రశ్నవేసుకోండి మీ మనస్సు చల్లారిపోతుంది, మీ దుఃఖం చల్లారిపోతుంది, మీ సమస్య అప్పటికప్పుడు తేలిక అయిపోతుంది, జ్ఞానమార్గం యొక్క వైభవం అట్టిది, విచారణ చేసి,





జపంచేసి, ధ్యానంచేసి, సాధుసాంగత్యంచేసి నీహృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకొంటే ఎంత అద్భుతంగా ఉంటుంది అంటున్నారు భగవాన్. కొంతమంది అన్ని భోగాల మధ్యన ఉంటారు ఎప్పుడూ ఏడుస్తూ ఉంటారు, కొంతమందికి ఏదైనా నష్టం వచ్చింది అనుకోండి కనిపించిన అందరినీ తిడతారు, దేవుడిని తిడతారు, కాని పాండువులు అరణ్యవాసంలో ఉన్నా, ఎన్నికష్టాలు పడుతున్నా వారు భక్తిని విడిచిపెట్టలేదు, ఇలాగ చేసావు ఏమిటి అని భగవంతుడిని నిందించలేదు.

నువ్వు ఏపని చేస్తున్నావో దానిని పెరఫెక్టుగా చెయ్యి, కర్మఫలం అంటకుండా చెయ్యి దానివలన ఈశ్వరుని దయకు నీవు పాత్రుడవు అవుతావు. మీరు ఏదైనా మంచిపని చేసారు అనుకోండి. ఎవరైనా వచ్చి మీరు మంచిపనిచేసారు అని మిమ్మల్ని పొగిడారు అనుకోండి. అప్పుడు మీకు సంతోషం వస్తుంది, అంటే కర్మఫలంతో మీరు తాదాప్యం పొందుతున్నారు అని అర్థం, అప్పుడు మిమ్మల్ని లిస్టులో నుండి బయటకు తీసేస్తారు. మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేసారు అనుకోండి. ఆస్తోత్రం చేయకముందు మీ మనస్సు ఎలా ఉందో, అది విన్నాక కూడా మీ మనస్సు అలాగే ఉండాలి. మిమ్మల్ని ఎవరైనా నిందించారు అనుకోండి. నిందించకముందు మీ మనస్సు ఎలాఉందో నింద విన్నాక కూడా మీ మనస్సు అలాగే ఉండాలి, వికారరహితముగా ఉండాలి. అప్పుడు ఈశ్వరుడు మిమ్మల్ని తన ఒడిలో కూర్చోబెట్టుకొంటాడు, అంతేకాదు తన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. కృష్ణుడిలో ఎంత జ్ఞానం ఉందో, అంత శక్తి కూడా ఉంది, అందుకే పూర్ణావతారం అంటారు. యుద్ధానంతరం అర్జునుడు కృష్ణుడిని ముందురథం దిగమంటాడు. అప్పుడు కృష్ణుడు నువ్వే ముందు దిగు అని అర్జునుడితో చెపుతాడు. అర్జునుడు ముందు దిగాడు, కృష్ణుడు దిగిన వెంటనే రథం కాలిపోయింది. ఎందుచేతనంటే అనేకమంది పెద్దవారు విడిచిపెట్టిన అస్త్రాలు, అర్జునుడిని భస్మం చేయకుండా ఆరథం మీద త్రొక్కిపెట్టి ఉంచాడు. ముందు కృష్ణుడు దిగిపోయాడు అనుకోండి ఆ అస్త్రాలు అర్జునుడిని భస్మంచేస్తాయి అందుచేత ముందు అర్జునుడిని దిగమని చెప్పాడు. అది భగవంతుడి యొక్క రక్ష, ఆరక్షణ అర్జునుడికే కాదు నమ్మితే మనకు కూడా వస్తుంది, నమ్మితే సొమ్ము నమ్మకపోతే దుమ్ము. జపం చేయగా చేయగా కొంతకాలానికి మనకు తెలియకుండానే లోపల జపం జరిగిపోతూ ఉంటుంది. కొంతకాలం నీవు సాధన చేస్తే తరువాత నీ ప్రయత్నంతో పనిలేకుండా లోపల సాధన జరిగిపోతూ ఉంటుంది. నీ హృదయంలో ఉన్న నిజం దగ్గరకు నిన్ను చేర్చి అది తప్పుకొంటుంది. మనకు చేతనయినంతవరకు, అవకాశం ఉన్నంతవరకు సత్కర్మను చేస్తూ ఉండవలసిందే, రూపంకంటే నామం గొప్పది అని చెపుతారు. నామాన్ని మీరు తక్కువ చూపుచూడవద్దు. మీ హృదయంలో ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి మీకు ఏవైతే ఆటంకాలుగా

ఉన్నాయో వాటినన్నింటిని, జపంకాల్చిబూడిద చేస్తుంది. జపానికి అంతశక్తి ఉంది అంటున్నారు భగవాన్. మీరు శ్రద్ధగా జపంచేస్తూ ఉంటే, శ్రద్ధ యొక్క తీవ్రతనుబట్టి మీరు ఆఫలితాన్ని పొందుతారు. మీలోఉన్న చిత్తశుద్ధినిబట్టి మీరు ఆఫలితాన్ని పొందుతారు, ఇంతటైము అని దానికి ఏమీ హద్దులులేవు. మీ హృదయంలో ఉన్న జ్ఞానం. సుఖం ఎప్పడైనా కొంత మీకు తెలిసినా అప్పడే ఒడ్డుకు వచ్చేసాము అనుకోవద్దు. పూర్వజన్మలనుండి వస్తున్న వాసనలు, తలంపులు అన్నీ పూర్తిగా కాలిబూడిద అయితేగాని మనకు వచ్చిన అనుభవం పెర్మనెంట్ అవ్వదు. ఏదో కొద్దిసేపు ఉండి మరలపోతుంది. సూర్యుడిని ఏవిధంగా అయితే మేఘాలు కమ్మేస్తాయో లోపల మన హృదయంలో ఉన్న నిజాన్ని వాసనలు, తలంపులు కమ్మేస్తూ ఉంటాయి. అందుచేత వాసనాక్షయం పూర్తి అయితేనేగాని మనకు వచ్చిన అనుభవం శాశ్వతంకాదు, అనుభవం శాశ్వతం అయితే గాని జననమరణ ప్రవాహం నుండి విడుదల పొందలేము.

అనేక కోరికలు జయించాము అనుకోండి. చివరకు ఒక కోరిక మిగిలిపోయింది అనుకోండి, అది కూడా పునర్జన్మను తీసుకొనివస్తుంది. మనం సాధనలో ఎందుకు ముందుకు వెళ్ళలేకపోతున్నాము అంటే దానికి ఒకటే కారణం మనం ఏదో శ్రవణం చేస్తున్నాము, ఇంటి దగ్గర జపం చేస్తున్నాము  కాని మనకు ఉండవలసినంత వైరాగ్యం లేదు. సాధనలో ఫెయిల్ అవ్వటానికి కారణం అదే. అభ్యాసంలేకుండా, వైరాగ్యంలేకుండా ఆత్మజ్ఞానం కలుగదు అని గీతలో భగవంతుడు చెప్పాడు మనం ఏపని చేసినా ఈశ్వర ప్రీత్యర్థం చేయాలి అంతేగాని గౌరవాలకోసం చేయకూడదు. ఇక్కడకు వచ్చి ఏదో మంచి పని చేశాను అనుకోండి, 'నాన్నగారు మంచిపని చేశారు అని మీకు అనిపిస్తుంది'. దానివలన నేను ప్రతిష్ఠకోరుకుంటున్నాను అనుకోండి అంటే అహంభావనను పోగొట్టుకోవాలనే బుద్ధి నాకు లోపల లేదు అని అర్థం. అహంభావనను పోగొట్టుకోవాలనే బుద్ధినాకు ఉంటే నేను ప్రతిష్ఠ కోరుకోను. నువ్వు సమాజానికి ఉపయోగపడాలి అనుకొంటున్నావు అనుకో నీవు ఆత్మజ్ఞానం సంపాదిస్తే నీద్వారా ప్రపంచానికి ఎంతో సహకారం జరుగుతుంది, నీకంటే మించి ఎవడూ చేయలేడు, అది లోపల జరిగే ప్రక్రియ. మీరు నామాటలు వింటూ ఉంటే, నాయందు గౌరవం కలిగి ఉంటే, నాకిష్టమైన పనులుమీరు చేస్తూఉంటే మీహృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకొనే బుద్ధిని నాచేత్తో మీకు ప్రసాదిస్తాను అని భగవంతుడు చెప్పాడు, అప్పటి వరకూ మీరు సాధన చేసినా తెలియదు. జీవుడు ప్రయత్నం చేస్తాడు కాని చివరిక్షణంలో దేవుని దయలేకుండా ఆముడి విడిపోదు, అజ్ఞానంలో నుండి బయటకు రాలేడు. దేవుని దయలేకుండా జీవుడు దేవుడిని పొందలేడు అని శాస్త్రంలో ఉంది. సాధన, తెలివితేటలు, బుద్ధిసూక్ష్మత, సాధుసాంగత్యం ఇవి అన్ని అవసరమే కాని అంతమాత్రం చేతనే





మోక్షం వచ్చేయదు. చివరిమెట్టు దగ్గరకు వచ్చేటప్పటికి సాధకుడికి దేవుని దయ లేకుండా ఆయనను పొందలేడు. ప్రతి మనిషి ధర్మాన్ని, సాంప్రదాయాన్ని కనుక ఆచరిస్తూ ఉంటే పోలీస్‌స్టేషన్‌లు, రిజిష్ట్రార్ఆఫీసులుఅక్కరలేదు. మన కళ్ళతో అనేకవేల శవాలను చూస్తూఉంటాము. కాని ఏదో రోజు మన శరీరం కూడా శవం అవుతుందని మర్చిపోతాము, మనకు ఏమీ ఇబ్బంది లేదు అనుకుంటాము, ఇదే మాయ. ఏదైతే ఎప్పుడూఉందో అదే సత్యమైనది. దేహం కొంతకాలం కిందట లేదు, ఇప్పుడు ఉంది, కొంతకాలం తరువాత ఉండదు అందుచేత ఇది సత్యం కాదు. మనస్సు కూడా సత్యం కాదు. మనస్సు రకరకాలుగా ఉంటుంది. గాఢనిద్రలో మనస్సు లేదు. ఒక అవస్థలో ఉండి ఇంకొక అవస్థలో లేనిది, ఒకప్పుడు ఉండి ఇంకొకప్పుడు లేనిది, ఒక ప్రాంతంలో ఉండి ఇంకొక ప్రాంతంలో లేనిది ప్రతీదీ అసత్యమే. నిద్రావస్థలో నీకు మనస్సు లేదు. నిద్రలో ఉండగా నీకాళ్ళమీద ఏదైనా పాము పాకి వెళ్ళిపోయింది అనుకోండి, నీకు తెలియదు.  అదే జాగ్రదవస్థలో అయితే భయం కలుగుతుంది. భయపడేది ఎవరు? మనసు. మనస్సు లేనపుడు భయంలేదు. ఆత్మజ్ఞానసముపార్జనకు అడ్డువచ్చే ప్రతిబంధకాలు అన్నీ మనస్సు లోనే ఉన్నాయి. అందుచేత మనస్సు నశిస్తేగాని అవి నశించవు. మనం పెంటమీద కూర్చుని చెడువాసన వస్తోంది అనుకోవటం ఎటువంటిదో మనస్సు చుట్టూ తిరుగుతూ నాకు అశాంతిగా ఉందనుకోవటం అటువంటిదే. అసలు మనస్సే ఆందోళన, మనస్సే అశాంతి. నువ్వు పెంటమీద కూర్చున్నపుడు చెడువాసన తప్పదు అలాగే మనస్సు చుట్టూ తిరుగుతున్నప్పుడు గందరగోళం తప్పదు. నీకు సంబంధంలేకుండా నీవు ఇతరవిషయాలలో కలుగజేసుకుంటూఉంటే మనస్సు పెరిగిపోతుంది  అని భగవాన్ చెప్పారు. సాధ్యమయినంతవరకు ఇతరుల విషయాలలో కలుగజేసుకోవద్దు. వచ్చినపని ఏదో చూసుకో, నీసాధన ఏదో నీవు చూసుకో, అప్పుడు మనస్సు నశిస్తుంది. ఏదోపని చెయ్యకుండా నీవు ఉండలేవు కాబట్టి సత్కర్మ చెయ్యి, నీవు తరిస్తావు. మనస్సు ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీలేదు. మనస్సు ఉంటే నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, సమాజం ఉంది, దేవుడు ఉన్నాడు, మనస్సు నశించేవరకు మనస్సు కల్పించిన విషయాలు కూడా జన్మజన్మలకూ నీకూడా వెంటాడతాయి. ఎన్నిశాస్త్రాలు చదివినా, ఎన్నిదేవాలయాల చుట్టూ తిరిగినా, ఎన్ని నదులలో మునిగినా నువ్వు మనోనిగ్రహం నేర్చుకోలేనప్పడు వీటివల్ల నీకు పెద్ద ప్రయోజనం ఏమీలేదు. మనోనిగ్రహం లేకుండా మనస్సు అణగదు. మనస్సు అణగకపోతే ఆత్మజ్ఞానం సాధ్యంకాదు. సందేహం పెట్టుకోవద్దు. కాలులోముల్లు ఎటువంటిదో, కంటిలో నలుసు ఎటువంటిదో సందేహం అటువంటిది. భగవంతుడు ఉన్నాడా, లేడా అని సందేహం పెట్టుకొంటూఉంటే ఇంక ఆయనను ఎలా తెలుసుకొంటావు. సందేహాలు వదిలిపెట్టు, దోషాలు విడిచిపెట్టు. విశ్వాసం నీకు బలం

ఇస్తుంది. కాని సందేహం బలం ఇవ్వదు. భగవంతుడిమీద నీకు విశ్వాసం ఉంటే నీకు ఆత్మవిశ్వాసం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం లేనివాడు ఏదీ సాధించలేడు. దేవుడులేడు అని చెప్పేవారు నాస్తికులుకాదు, వారి మీద వారికి నమ్మకం లేనివారు నాస్తికులు అని స్వామీజీ చెప్పారు. మన మీద మనకు విశ్వాసం లేకపోతే జీవితంలో ఏదీ సాధించలేము. నాస్నేహితులు చాలామంది ఉన్నారు. మమ్మల్ని బట్టే నాన్నగారికి జ్ఞానం వచ్చింది అని చెప్పేవారు కొంతమంది ఉన్నారు. నాన్నగారి దగ్గర మనం నేర్చుకొన్నాము అనేది వదిలేసారు, మేమే నాన్నగారికి జ్ఞానం ఇచ్చాము అని చెప్పేవారుకూడా ఉన్నారు. చివరకు విద్య అక్కడవరకు వచ్చింది. అలా అనుకోవటం వలన మనకు వచ్చే నష్టం ఏమీలేదు. ఆత్మ పెరిగేదికాదు, తరిగేదికాదు. సముద్రంలోనికి నదులు వెళ్ళికలవటం వలన దానికి వచ్చిన లాభంలేదు, నదులు వెళ్ళి కలవటం మానివేయటంవలన దానికి వచ్చిన నష్టం లేదు. దానివలన సముద్రం యొక్కలోతు ఏమీ తగ్గిపోదు. సముద్రం సముద్రమే జ్ఞానం జ్ఞానమే. ఉన్నది ఒక్కటే అసలు రెండు అనేది లేదు. ఒకటే నీకు అనేకంగా కనిపిస్తోంది అది ఒకలీల, అది ఒకమాయ అంతేగాని ఉన్నది ఒక్కటే. జ్ఞాని తనను అందరిలోను చూసుకొంటాడు, అందరినీ తనలో చూసుకొంటాడు. అలా ఎవడైతే చూసుకొంటున్నాడో వాడే జ్ఞాని. జ్ఞానికి స్వపరభేధంలేదు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు కాని ఆనమ్మకం మనకులేదు. చెట్లను, పుట్లను పట్టుకొని తిరుగుతున్నాము, ఎక్కడరాయి కనిపిస్తే ఆరాయి మీద పడుతున్నాము. అంటే రాళ్ళకు మొక్కకూడదనికాదు. ఆరాయిలో దేవుడు ఉన్నాడు అనేటంత నమ్మకం మన హృదయంలో ఉన్న దేవుడిమీద మనకు కలగటంలేదు. లోచూపు లేకపోవటంవలన ఆ నమ్మకం నీకు కలగటంలేదు. అనేకజన్మలనుండి మనకు బాహ్యచూపు అలవాటు అయిపోయింది, ఆచూపును లోపలకు త్రిప్పాలి, లోచూపు లేకుండా నీ హృదయంలో ఉన్న సౌందర్యం తెలియదు. నీ హృదయంలో ఉన్న ఆనందం నీకు తెలిస్తేగాని అసలు హృదయం వైపుకు ఆకర్షణ కలుగదు. కొంచెం ముల్లంత, రవ్వంత మనస్సును లోపలకు త్రిప్పితే లోపల ఉన్న పరమేశ్వరుడు మన మనస్సును పట్టుకొని లోపలకు లాగేసుకొంటాడు, మనం లోపలకు ఒక్క అడుగువెళితే, మిగతా 99 అడుగులు ఆయనే గుంజేసుకొంటాడు. నీ జీవితాన్ని సరిదిద్దుకొని, నీబుద్ధిని సరిదిద్దుకొని, లోచూపు నేర్చుకొని, నీహృదయంలోఉన్న వస్తువును సాక్షాత్కరింపజేసుకొంటే అప్పుడు అదే అంతటా ఉంది అనే అనుభవం నీకు వస్తుంది. కాని నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు తెలియకుండా బయట ఏదో ఉంది అని అనుకొంటే ఆరోజుకారోజు నీకు బాహ్యచూపు అలవాటు అయిపోతుంది కానిలోచూపు నీకురాదు. ఇవాళ మన సబ్జక్టు ఏమిటి అంటే హృదయంలో ఉన్నవాడిని వదిలేసాము, ఎక్కడెక్కడో ఉన్నాడని తిరుగుతున్నాము. సరే తిరగండి కాని హృదయంలో ఉన్నవాడిని కూడా గుర్తించండి.

**5-12-2003**



## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 18-11-03, జువ్వలపాలెం

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

శరీరానికి కంపర్టు అవసరం, మనస్సుకు కంట్రోలు అవసరం ఈ రెండింటికి యోగాభ్యాసాలు కొంతవరకు సహకరిస్తాయి, అంతమాత్రం చేతనే మనస్సు నశించదు. మనోనాశనం కలగకుండా జ్ఞానోదయం కలుగదు. ధర్మాన్ని ఆచరించకుండా ఎవరికి ఆత్మజ్ఞానం కలగదు. స్వార్థపరుడికి ఆత్మజ్ఞానం కలిగే అవకాశంలేదు. భగవంతుడు ఏపని అయితే మనకు అప్పగించాడో ఆపనిని శ్రద్ధగా, జాగ్రత్తగా చెయ్యాలికాని పని విడిచిపెట్టి పారిపోయే బుద్ధి పనికిరాదు. పనియందు గౌరవం పెంచుకోవాలి, పనిమానివేస్తే ఆత్మజ్ఞానం కలుగదు. మీరు జపం చేసుకోవచ్చు, ధ్యానం చేసుకోవచ్చు, కాని జపం పేరుమీద, ధ్యానం పేరుమీద మీరు ఇంటి దగ్గర చేసే పనుల దగ్గర అశ్రద్ధగా ఉండకూడదు. పని మనలను విడిచిపెట్టాలిగాని మనం పనిని విడిచిపెట్టకూడదు అని రామకృష్ణుడు చెప్పారు. మనం పనిని విడిచిపెడితే ఆపనిని వడ్డీతో సహా వచ్చే జన్మలో భగవంతుడు మన చేతచేయిస్తాడు. మనం మంచికర్మ చేసిన, చెడుకర్మ చేసిన దానిని భగవంతుడు మనకు అనుభవంలోనికి తీసుకొనివస్తాడు. పుణ్యఫలం సుఖరూపంలో, పాపఫలం దుఃఖరూపంలో వస్తుంది. అదీ ఖర్చు అయిపోతుంది, ఇది ఖర్చు అయిపోతుంది. రెండూ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. మనశరీరంకూడా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. వచ్చింది ఏదైనాసరే పోతుంది, ఎప్పుడూ ఉండేది ఏదో ఉంటుంది. ప్రపంచాన్ని మనస్సు చూస్తోంది. చూడబడేది ప్రపంచం, చూచేవాడు జీవుడు, చూచుట ఈమూడింటిలోనుండి విడుదల పొందకపోతే కోటిజన్మలు ఎత్తినా దుఃఖం మనలను విడిచిపెట్టదు. ఈ త్రిపుటిలో సుఖంలేదు, శాంతిలేదు, ఆనందంలేదు. ఈ త్రిపుటిని ఓవర్‌కమ్ చేస్తేగాని మనకు బ్రహ్మానుభవం కలుగదు. అది మాటలకు, మనస్సుకు అందదు, అది అనుభవైకవేద్యం. బ్రహ్మానుభవం పొందటంకోసం కామక్రోధముల యొక్కవేగం, రాగద్వేషములయొక్క వేగం తగ్గించుకోవాలి. ఈశరీరం మరణించాక కాదు, ఈశరీరం ఉండగానే రాగద్వేషముల యొక్క వేగం తగ్గించుకోవాలి. లోపలఉన్న భగవంతుడికి ఇష్టంలేదు అయిష్టంలేదు, రాగంలేదు ద్వేషంలేదు వాడు సమానంగా ఉంటాడు, వాడులోపల ఉంటాడు, బయట ఉంటాడు, అంతటా ఉంటాడు. నువ్వుకూడా అలాగ ఉండగలిగితే ఆయన స్వరూపాన్ని పొందుతావు. నేను ఇలా ఉండాలి, నేను అలా ఉండాలి అనుకోవటం పిరికివాడి లక్షణం సమాజాన్ని అనుకరించేవాడికి ఎవడికీ జ్ఞానం కలుగదు. భగవంతుడు ఎలా జీవించమని చెప్పాడో అలా జీవించేవాడికి భగవంతుడు స్వరూపంగా వ్యక్తమవుతాడు. అంతేగాని పదిమంది అలా ఉన్నారు నేను కూడా అలా

**రమణ భాస్కర**